# బుచ్చి వెంకయ్యమ్మ

ఇది కేవలము కల్పితకథ. నామిత్రుడగు ఒక రెడ్డిమహాశయుని ప్రోత్సాహమున దీనికి వ్రాసితిని. పదకొండేండ్లప్రాయమున ఆయన యేకపుత్రిక వైధవ్యము పాలబడెను. అప్పటికామె రజస్వల యైన కాలేదు. రజస్వల కాకపూర్వమే నిషేకము చేయు ఆచారము భూమంచిరెడ్లలో లేకపోలేదు. అయినను ఆమె ఆవిధముగనైన భర్తముఖము నెఱుగని బాల. ఆమె తండ్రి నాకు స్నేహితుడు. తన్మూలమున ఆమెను నేను బాగుగ నెరుగుదును. ముక్కుపచ్చలారని ఆ బాలవితంతువును చూచి అందరును వగచిరి. ఆమెనే సకలముగా భావించుకొను తలిదండ్రుల సంగతి యిక చెప్పనేల? తల్లి చాలా కాలము నిద్రాహారము లెరుగదు. తండ్రి అనేక వ్యవహారములను మరచిపోయెను. దుఃఖించుట, అనుభవించుట తప్ప వేఱుగతిలేదు. భూమంచిరెడ్లలో వితంతువివాహవాంఛయైన పొడమని రోజులవి. అయితే తండ్రి లోకజ్ఞానము కలవాడు. అనేక వర్ణములలో ఈయాచారము జరుగుచుండుట ఆయన బాగుగా నెరుగును. అయితే యేమి లాభము? తమ వర్ణమున లేని యాచారము బైటనెందు ఉండిన నేమి? నే నోదార్పఁబోయినపు డాయన ఈ విషయమునే ప్రస్తావించెను. "బాలవితంతు వగు ఒక రెడ్డి యువతి మరల పెళ్లి చేసికొన్నట్లు ఒక కథ కల్పించండి" అని నన్నాయన కోరెను. అట్టి కథలవలన కులమున చలనము పుట్టవచ్చునని ఆయన ఊహ. "నా బిడ్డకు అట్టి సౌభాగ్యము కలుగకపోవచ్చును. అయినా యీ విషయమున కదలిక పుట్టి తీరవలసియున్నది" అని ఆయన ఖచ్చితముగా చెప్పినపుడు "మిత్రునివాంఛ అని యుత్సాహంతో దీనిని వ్రాసితిని. ఇది ప్రకటింప దలచినప్పుడు కొన్ని చమత్కారములు జరిగినవి. వాని నన్నిటిని ఇక్కడ చెప్పవలసిన పనిలేదు. ఈకథ సంగతి విని మరియొక రెడ్డి మిత్రుడు "ప్రకటింపు" దని చెప్పెను. ఒక మిత్రుని ప్రోత్సాహమున వ్రాయబడిన యీ చిన్నకథను మఱియొక మిత్రుని ప్రోత్సాహమున ప్రకటించుచున్నాను. నా మిత్రుని యుద్దేశము ఈ కథవలన నెరవేరినచో నేను మిత్ర కార్యమును నెరవేర్చినవాడనగుదును.

– సుబ్రహ్మశాస్త్రి.

"నా కథ చెబుతున్నాను. మీరెప్పుడూ ఇలాంటి కథ విని ఉండరు. అంతా కొత్త. ఎవరూ చేయనిదీ ఎవరూ యెరగనిదీకూడానూ. అంటే మన కులంలో యింతవరకు ఆయాలోచన లేకపోయింది. మన కులంలో యిట్టి కథ పుట్టడానికి నేనే మొదలు. ఇది కొత్త కనక దీన్ని గురించి యిప్పటి

ప్రజాభిప్రాయం కనుక్కోవడం మంచిదిగాదు. ఏమంటే? మంచిదయినాసరే కొత్త ఆచారం అంటే యిప్పటి వారు అంగీకరించరు".

"నిజమే, అంగీకరించరు. అయితే మాతండ్రి యిప్పుడు "ఏంతప్పా?" అని వచ్చినవారి నందరినీ అడుగుతాడు, ఎవరూ సమాధానం చెప్పలేక మొగమొగాలు చూసుకుంటూ ఉంటారు".

"నేనూ ఆ మాటే అడుగుతున్నాను. ఇష్టమున్న వితంతువు మళ్ళీ యెందుకు పెళ్ళాడగూడదూ? మీకు సాహసం వకటే లేదు; గాని లోకంలో వితంతువుల స్థితి అంతా చూస్తూనే ఉన్నారు. వితంతువు మాత్రం మనిషికాదూ? మీరెలాంటి ఆహారాన్ని స్వీకరిస్తున్నారో వితంతువులూ అలాంటిదే ఉపయోగించేటప్పుడు మీకెలాంటి చిత్తవృత్తులు కలుగుతున్నాయో వితంతువులకు మాత్రం అలాంటివి యెందుకు కలగవూ? వయసు వచ్చేక మీరు మీ భర్తలతోటి బిడ్డలతోటి సుఖిస్తున్నారు. "ఆ సౌభాగ్యం మాకెందుకు లేకపోవాలీ?" అని వితంతువులు అడిగితే మీరేం చెబుతారూ?బతికి ఉన్నంత కాలమూ వితంతువులు యెందుకట్టైలై అధోగతి పొందడానికి అది వితంతువులు స్వయంగా చేసుకున్న పాపమా? సంఘం బలాత్కారంగా మీదవేసి రుద్దుతూ ఉన్న దౌర్జన్యమా? లోకంలో అన్ని దేశాలలోనూ, అన్ని మతాలలోనూ వితంతువి వాహాచారం ఉంది. బలాత్కార వైధవ్యం ఒక్క మనదేశంలో మాత్రమే ఉంది. ఇది యిలా ఉండిపోవాలంటే ఉండిపోదు. అంతర్వేది అవతల వూళ్ళు లేవంటే నమ్మేకాలం పోయి చాలరోజులయింది. తెల్లదొరల యేలుబడి వచ్చేక గూడా సంఘం మునపటిలాగే ఉండిపోవాలంటే ఉండిపోదు".

"యెలా ఉంటుందీ? మనదేశంలో శాస్త్రాలు వప్పుకోవండీ" అంటూ కుండల్లో గుర్రాలు తోలుతూ ఉండే బ్రాహ్మల్లోనే యీ ఆచారం ముందు బయలుదేరింది. ఇప్పుడు వారిలో మళ్ళీ పెళ్ళాడి సంసార సౌఖ్యం అనుభవించుతూ ఉన్న వితంతువులు వేలు ఉన్నారు. వారందరూ మొత్తం మీద సంఘంలో కలిసే ఉన్నారు. ఇప్పుడు బ్రాహ్మలికి ఇతర జాతిస్త్రీలని పెళ్ళాడేటంత ఉన్నత భావాలుకూడా పుడుతున్నాయి. అదంతా మీరేం యెరుగుదురూ?".

"మొత్తంమీద లోకం యెలా ఉందో మీరెరుగరు. మా అమ్మకూడా మొదట అంతే. నా అదృష్టం వల్ల యిప్పటికి ఆవిడికి భావోన్నతి కలిగింది. అంటే హృదయంమీద కమ్మి వున్న ఛాదస్తం యిప్పటికి వదిలిపోయింది. కనకనే నేనిప్పుడు యిలా సుఖమయప్రపంచంలో వుండగలిగేను".

"వక్క క్షణంలో మారిపోయింది మా అమ్మ. "పోతంశెట్టి జానకమ్మ యిలా చేస్తుందని యెప్పుడూ అనుకోలే" దని ఊళ్ళోవారందరూ చెప్పుకుంటారు. ఇది తలుచుకుని మా అమ్మకూడా ఆశ్చర్యపడుతూనే వుంటుంది. నిజానికి యిందులో ఆశ్చర్య కారణం లేదు. ఏమంటే? పోతంశెట్టి రాఘవరెడ్డి మారిపోయాక పోతంశెట్టి జానకమ్మమాత్రం మారిపోదూ?"

"స్త్రీ జాతి యొక్క రహస్యాన్ని నేను బైటపెడుతూ వున్నానని మీరు కోప్పడితే చెప్పలేను; గాని మొగాడు నిశ్చలంగా వుంటే ఆడది మారకుండా యెలా ఉంటుందీ? వీధిలో యెలా గంతు లేసినా యింటోకి వెళ్ళగానే మొగాళ్ళు అణిగి ఉంటారు, గాని మా నాయన అలాంటి వాడు కాదు. మాయమ్మని మానాయన చాలా చమత్కారంగా స్వాధీనం చేసుకున్నాడు. చమత్కారం అంటే- చమత్కారమే లేదూ. మొదట ధర్మాలన్నీ చెప్పేడు. తరువాత లోకం సంగతి అంతా చెప్పేడు. చివరికి కష్టసుఖాలన్నీ బాగా బోధించాడు. ఇప్పుడు మా నాన్న యేదేనా చెప్పడం - తలుచుకోవడమే తరువాయి, మా అమ్మ చేసేస్తుంది. నా పెళ్ళి అలాగే చేసింది.

"రాయవరంలో మా నాయన మొదట కులపెద్దలంతా యెలా వుండీవారో అలాగే వుండేవాడు. పీసపాటి వేంకటరామయ్యగారు మా యింట్లో అడుగుపెట్టిన సంవత్సరానికి పూర్తిగా మారిపోయాడు. వేంకటరామయ్యగా రంటే మా నాయనకి యిప్పుడు దేవుడే"

"ఆయనకి తల్లీదండ్రీకూడా చిన్నతనంలోనే చచ్చిపోయారు. చూసీ దిక్కులేక రాజమండ్రీ చేరుకున్నారు. మంచిబుద్ధిగనక నేటి ఔన్నత్యం వారికి కలిగింది. వారు వారాలు చేసుకుని జీవించారు. యాచన చేసి జీతం సంపాదించుకున్నారు. విద్యార్థుల నాశ్రయించి పుస్తకాలూ, సేవచేసి ఉపాధ్యాయుల అనుగ్రహమూ గడించుకున్నారు. మునిసిపల్ లాంతర్ల దగ్గిర నుంచుని చదువుకున్నారు, కాని యిప్పుడెంత బీదవారికెంత ఐశ్వర్యమూ?".

"ఆశ్చర్యం కలుగుతుంది. వెంకట రామయ్యగారు ఇప్పుడు నాలుగులక్షలికి ఖామందు. ఆకథంతా తరువాత చెబుతాననులెండి. ఆయన ఒకనాడు మా యింటికి వచ్చేరుట".

"తెల్లవారింది. పదిగంటలికి ద్రాక్షారంలో పెద్దకలకటేరు దగ్గిర ఉండాలి మా నాయన. గుమ్మందిగేటప్పటికి వారు యెదురుగా వచ్చేరు. మా నాయన సందేహించాడుట. మాయమ్మ లోపలికి వచ్చి మళ్ళీ వెళ్ళమందిట. ఇదంతా కనిపెట్టేరువారు. 'రెడ్డిగారూ, సందేహం వద్దు, ఈశ్వరసంకల్పానికి వ్యతిరేకం యెప్పుడూ జరగదు. నేను వొంటి బ్రాహ్మణ్ణే. బ్రహ్మచారినే. అయినా ముందుకు వేసిన కాలు వెనక్కి తియ్యవద్దు అన్నారట. మా నాయనికి ధైర్యం వచ్చిందిట. "ఏమయినా సరే" అని వెళ్ళేటప్పటికి కార్యం అనుకున్న దానికంటె బాగా అయిందిట".

"యింటికి రాగానే పిలుచుకురా వెంకటరామయ్యగారి" నని మంగలిని పంపేడుట మా నాయన. వారు వచ్చిన తరువాత గొడవలు మొదలు. వెంకట రామయ్యగారు నుంచున్నపాళంగా మన చాదస్తాల నన్నింటినీ తప్పని పించారుట మా నాయనచేత. అంతేకాదు. గురువుగారుగా ప్రవేశించారుట.".

"సంవత్సరం గడిచాటప్పటికి మా నాయన మంచి రాతగాడయినాడు. మంచిచెడ్డలన్నీ బాగా తెలిశాయి. ఐశ్వర్యానికి తగిన జ్ఞానం వచ్చిందిట. "ఏమిటీ యీయిరుకు సందులో కాపరం?" అని మా నాయన మాపొలంలోనే యిల్లు కట్టేశాడు. దీనికి కారణం వెంకటరామయ్య గారే".

"పన్నెండుపుట్లభూమి యేకఖండం. యిటు వెదురుపాక కాలవకీ, అటు సోమేశ్వరం రోడ్డుకీ చేరి వుందది. దొడ్లో వ్యవసాయం. పక్కదొడ్లోపాడి, వెనకదొడ్లో పంట. రైతుకి యింతకంటే యేంకావాలీ!"

"అప్పటికినాకు ఆరేళ్ళవయస్సూ, ఏకసంతానం కావడంచేత మాతలిదండ్రులు నన్ను చేతుల్లో పెంచారు. నన్నిప్పటికీ అలాంటి గారంగానే, చూస్తారు మా వాళ్ళు."

"మాయమ్మా, నేనూ ఒక్కమాటే పలక పుచ్చుకున్నాం. రెండు సంవత్సరాలికి మాయమ్మ పుస్తకం విడిచిపెట్టింది. ఇక గురువుగారు చెప్పనక్కరలేదు. నాకు మాయమ్మకూడా చదువు చెప్పేది".

"వూళ్ళో వున్న మా యింటిపక్కని వక బీదకుటుంబం ఉండీది. భద్రాచలంకలరాలో మొగుడూ, పెళ్ళామూ వక్కమాటే చచ్చిపోయారు. తొమ్మిదేళ్ల భూపతిరెడ్డి మాత్రం మిగిలేడు. దిక్కులేదు. మూడురోజులు వాళ్ళూవాళ్ళూ పెంచారుట. ఈసంగతి మానాయనికి తెలిసింది. మర్నాడు వేంకటరామయ్యగారు అతణ్ణి మాయింటో ప్రవేశపెట్టారు".

"పెట్టుపోతలు వచ్చినపుడు మా నాయనికి తనవాళ్ళూ పరాయివాళ్ళూ అని భేదం లేదు. తన సొమ్ము ఎవళ్లేనా తింటే తృప్తిగా తినవలసిందే. "దైవేచ్ఛ యెలా ఉందో చెప్పలేం. అమ్మాయితో సరిగా చూడాలి భూపతిరెడ్డిని" అని మానాయనచెప్పగా మాయమ్మ "సరే" అంది.

"భూపతి చురుకు మా నాన్న బాగా కనిపెట్టేడు "ఎప్పటికేనా మనయింటోవాడే. చదువు బాగా చెప్పండి." అని మా నాయన చెప్పగా వేంకటరామయ్యగారు అలాగే చేశారు. రెడ్డి వూళ్లో బర్లో రెండోక్లాసు చదివేడు; కాని మట్టిబొమ్మలు చెయ్యడమూ, పాటలుపాడడమూ తప్ప యేమీ చదువు అంటలేదు. వేంకటరామయ్యగారు నెలరెజుల్లో దారికి తెచ్చేరు."

"భూపతికీ నాకూ చాలాస్నేహం కలిసింది. మాయమ్మ మమ్మల్ని యిద్దరినీ వక్కకంటితో చూసీది. అంచేత మాకలాకలిసిపోయింది. భూపతి నేను అన్నం తింటే తింటాడు. నేను పడుకుంటే పడుకుంటాడు. నేను ఆడితే ఆడతాడు. నేనేం చేస్తే అది చేస్తాడు. మేమిద్దరమూ యేమీ భేదం యెరగం".

"మా నాయనా, మాయమ్మా, నేనూ, భూపతీ-నలుగురమూ ఏకపంక్తిని భోజనం చెయ్యడం అలవాటు. మా నాయన్ని మాయమ్మ పిలుస్తుంది. నేను రెడ్డి నేనా పిలిచీదాన్ని, రెడ్డి నన్నేనా పిలిచీవాడు. ఇద్దరిలో ఎవరో వకరు పిలవాలి. లేకపోతే ఆపూట పస్తన్నమాటే".

"వకమాటు భూపతిరెడ్డి మామిడిపండు కోస్తున్నాడు. కత్తి యిమ్మని యెన్ని విధాల అడిగినా యిచ్చాడుకాడు. నాకు కోపం వచ్చింది. కానయితే కత్తి చాలా పదునుగానే ఉంది. కోపం పట్టలేకపోయాను. ఎక్కడలేని కోపం వచ్చింది ఆ వేళ నాకు. కత్తిపట్టుకోవడం చేతగానిదాన్నా నేనూ? నువ్వేం చేసినా యివ్వనన్నాడతను. వుళాక్కోపోగా అందనిచ్చాడు కాదు. క్షణం వుండలేక పోయానక్కడ. చరచరా నా గదిలోకి పోయాను".

"ఆపూట రెడ్డిని నేను పిలవలేదు. చూడగా బంతిలో భూపతిలేడు. మా అమ్మ అడిగితే మామిడిపళ్ళు తిన్నాడని, ఆకలిలేదు కాబోలుననీ చెప్పేను. నాకయితే ఆకలి బాగానే వుందిగాని అన్నం నోటికిపోయింది కాదు".

"భూపతిని నేను తప్ప యెవరు పిలుస్తారూ? పిలిస్తే మాత్రం అతనెలా వస్తాడూ? బంతిలో లేకపోవడం వకటీ, అతను పస్తుండడం వకటీనీ, చాలా కష్టంగానే వుంది నాకు. కాని తిక్క మళ్ళించుకో లేకపోయాను. నేను గూడా సంగ సగం తినిలేచాను. పోయి పడుకున్నాను మాట్లాడకుండా".

"ఇలా రెండుపూటలు జరిగింది. ఆ రెండుపూటలూ ఉపవాసమే. భోజనాలదగ్గిర ఈ గొడవవస్తుందని నేను ముందుగానే వంటయింటోనే తిని వెళ్ళిపోయాను. ఆ పూటగూడ నేను సగంసగమే తిన్నాను. అన్నం రుచే కనపళ్ళేదూ. వూకబొక్కినట్లుంది. ఆకలికూడా చావలేదు. ఏం చెయ్యను? ఆ పూట గూడా తిక్క తిరగలేదు".

"మూడో పూట వచ్చింది. చాలా ఆలస్యంగా వచ్చింది. నాకు కళ్ళు తిరిగిపోతున్నాయి. సగం తిన్న నేనే యిలా ఉండగా రెడ్డి యెలా వుంటాడూ? ఆగలేకపోయాను. ఒక్క పరుగులో వెళ్ళి మీదపడ్డాను. కడుపు అక్కళించుకపోగా ముడుచుకుని పడుకుని ఉన్నాడు రెడ్డి. గుట్టుకి పడివున్నాడు గాని ఆకలి దహించుకొని పోతోంది. ముఖం మీది ముసుగుతీసి చూశాటప్పటికి నాకేడుపు వచ్చింది. నాయేడుపు చూసి అతనుగూడ యేడవడం మొదలుపెట్టాడు. ఇక చెప్పవలసిందేముందీ? ఇద్దరమూ ఏడ్చాము. గడియలకొద్దీ యేడ్చాము. తలుచుకొని తలుచుకొని చూసుకుని చూసుకొని యేడ్చాము. నన్నోదార్చి అతనేడ్చాడు. అతన్నోదార్చినేనేడ్చాను. ఇది చూచి దాసీది పోయి చెప్పగా మా అమ్మ వచ్చింది. మా యమ్మ వెనక్కాల మానాయన వచ్చాడు. వాళ్ళిద్దరూ మమ్మల్ని యిద్దర్నీ పట్టుకున్నారు. అప్పుడు మరింత యేడ్చాం. చివరికి వెక్కి వెక్కి యేడుస్తూ నేను జరిగినదంతా చెప్పేశాను. మా వాళ్ళు తెల్లపోయి కొంతసేపటికి ఓదార్చేరు. ఆపూట రెడ్డికి అన్నం నేను కలిపిపెట్టేను. కాని యీపాపం చాలా పెద్దదనీ, యెప్పటికేనా కట్టికుడుపుతుందనీ భయంగానే ఉంది నాకు. అయితే యేంచెయ్యగలనూ? ఎప్పుడో అనుభవించాలి".

"చెప్పివచ్చిందేమీ లేదూ. భూపతికీ నాకూ అంత జత. ప్రతీ ఆదివారమూ సాయంత్రం మేము షికారు వెళ్ళీవాళ్ళం. బండికి నరెడ్లని కట్టి తెచ్చీవాడు పాలికాపు. భూపతి నన్ను ఎత్తుకొని తీసుకుని వచ్చి బండి యెక్కించి తను చక్రాలమీద నుంచి యేక్కీవాడు. పాలికాపు పగ్గాలు పట్టుకొని ముందు పరిగెడుతూ ఉంటే తొట్టిలో కూచుని రెడ్డి బండితోలీవాడు. నేను అతనిదగ్గర కూచుని కబుర్లు చెబుతూ పొలాలు చూస్తూ ఆనందించి అతన్ని ఆనందపెట్టేదాన్ని. లొల్లదాటి మురుక్కాలవ దాకా వెళ్ళేక బండి తిప్పమనీవాడు అతను. సోమేశ్వరం దాకా వెళ్ళాలనీదాన్ని నేను. యిద్దరికీ తగువు పెరిగేది. ఒక్కొకపుడు అతను గెలిచీవాడు ఒక్కొక్కప్పుడు నేను గెలిచీదాన్ని. ఇంటికి వచ్చాటప్పటికి యెదురుగా వచ్చి "యెవరు నెగ్గేరు యివాళ?" అని మాయమ్మో, మానాయనో అడిగితే నెగ్గినవాళ్ళం యెగురుతూ దుముకుతూ నేనంటే నేననేవాళ్ళం".

"రాత్రి పాఠాలు చదవడంలో పంతాలు వేసుకునీవాళ్ళం. పైకి చదవగూడదు. ఇద్దరూ వక్కమాటే పడెయ్యాలి పుస్తకాలు. అతనికి నేను నా కతనూ పాఠాలు వప్పగించుకొనీవాళ్ళం. వకళ్ళకి వకళ్ళు లెక్కలు చెప్పుకోవడం. ప్రశ్నలు వేసుకోవడం. ఇద్దరి పుస్తకాలూ అతను సర్దీవాడు. ఇద్దరి పక్కలూ నేను సర్దేదాన్ని. కథలు చెప్పుకుని చెప్పుకుని పదిగంటలకి నిద్రపోయీవాళ్ళం. మళ్ళీ తూర్పుతెల్లవారేటప్పటికి లేవాలి. అప్పుడుగూడా పంతాలే. ముందు లేచిన వాళ్ళకి తరువాత లేచినవాళ్ళు పళ్ళుదోముపుడకా నీళ్ళూ తెచ్చి యివ్వాలి"

"పొద్దు పొడిచేటప్పటికి ఇద్దరికీ స్నానం అయింది. అప్పటికప్పుడే మా గురువుగారు వచ్చీవారు. ముగ్గురమూ గుమ్మపాలు తాగి చదువు మొదలుపెట్టీవాళ్ళం."

"ఆకాలం యిలా గడిచిపోయీది. ఎంత సుఖమూ? ఎంత ఆనందమూ? మాకిప్పుడు సుఖానికి యెంతమాత్రమూ లోటులేదు. కాని అప్పటి సుఖం ముందు యిది యెంత అనిపిస్తూ ఉంటుంది. ఒక్కొక్కప్పుడు ఆ చదువు, ఆ మాటలు అవన్నీ జ్ఞాపకం వస్తే ఒళ్ళు తెలియదు మాకిద్దరికీ గూడా".

"ఇలా ఉండగా రావులపాలెం నుంచి మావేనత్త వచ్చింది. "బుచ్చివెంకయ్య నా కోడలు. ఏమంటావు?" అంది. మాయమ్మ "నీ యిష్టం" అంది. మా నాయన "మా బిడ్డ నీకోడలే. అయినా పెద్దదయిదాకా ఉండలేవూ? అన్నాడు. "ఉండలే" నంది మా అత్త. "అయితే నీయిష్టం" అన్నారు మా అమ్మా, మా నాయనానూ. ఆపాళంగా "రావే కోడలా" అని నన్నెత్తుకుని ఒడిలో కూచోపెట్టుకుని .నగలు పెట్టింది మా అత్త. కాసులపేరూ, కంటీ, మువ్వలపట్టెడా పెట్టింది. పెరిగిన తరువాత యింకా చేయిస్తానంది.

"ఇంట్లో అందరూ సంతోషంగా ఉండడంచేత నేనూ సంతోషంగా నేవున్నాను; గాని భూపతిరెడ్డిని చూశాటప్పటికి మనస్సు చివుక్కుమంది. నేను పెళ్లయి అత్తారింటికి వెళ్ళేక అతనికి గుమ్మపాలు యెవరందిస్తారూ? అన్నానికి ఎవరు పిలుస్తారూ? పొలాన్నుంచి యింటికి వచ్చేటప్పటికి వెళ్ళి "మంచినీళ్ళు కావాలా?" అని యెవరు అడుగుతారూ? ఇంకా యింకా తలలో నాలికై యెవరు ఉంటారూ? మనస్సు కలిగిపోయినట్లయింది. నా దగ్గిరినుంచి భూపతిరెడ్డిని యెవరో బలవంతంగా దూరం చేస్తున్నట్లు తోచింది. ముఖం పైకెత్తి అతని మొగం చూశాటప్పటికి అతని మనస్సులోగూడా ఇలాంటి వూహలే పనిచేస్తున్నట్లు తోచింది. గుండె గుభేలుమంది నాకు".

"ఇలా ఉండగా అప్పటికి అతనికి పద్ధానుగేళ్ళు వచ్చాయి గనుక "యిక పొలం వెళ్ళి పని చూస్తూ ఉండు" అన్నాడు మానాయన. "నెలకి పదిహేను రూపాయలు భూపతిపేర జమకడుతూ ఉండం"దని వేంకటరామయ్యగారితో గూడా చెప్పేడు. అది మొదలు భూపతి నాకు కొంచెం యెడ మయినాడు. సాయంత్రం అతనింటికి వచ్చేదాకా నెలరోజులు నాకు మతిపోయినట్లుండీది. ఏం చెయ్యనూ? మరో నెల కడిచేటప్పటికి కొంచెం అలవాటయింది. భూపతి పగలంతా పొలంలో యెంత కష్టపడివచ్చినా రాత్రిపదిగంటలదాకా నాతో కబుర్లు చెప్పకుండా నిద్రపోయీవాడు కాదు".

"వైశాఖమాసంలో నాకు పెళ్ళయింది. నా పెళ్ళి చాలా వైభవంగా అయింది. మా నాయన నాచేత వెయ్యిన్నూటపదహార్లు గురుదక్షిణ యిప్పించేడు వేంకటరామయ్యగారికి. వారిని "తొరగా పెళ్ళాడండీ" అని గూడా చెప్పేడు".

"మనుగుడుపులకి వెళ్ళిన నాలుగు రోజులూ నాకు భూపతిరెడ్డి లేకపోవడంచేత నిజంగా మతిపోయింది. అది కనిపెట్టి "యిలాగైతే

యింకేలాగమ్మా?" అని మా అమ్మగూడా అడిగింది. అడిగితే మాత్రం యేం చెయ్యగలనూ? ఇంటికి వచ్చిననాడు రెడ్డీ నేనూ గూడా నిద్రాహారాలు యెరగం. పొలంలోనుంచి అతను వచ్చాడు. రావులపాలెం నుంచి నేను వచ్చాను. నాకంటే ముందు వచ్చి అతను చొక్కా విప్పుకున్నాడు. ఇంతే. ఇంతలో మా బండి గుమ్మంలోకి వచ్చింది. గంటల చప్పుడు విని "వచ్చారు" అని కెవ్వున కేకవేసి బండిదగ్గిరికి వచ్చి ఉరికేడతను. బండిమీద నుంచి అతనిమీదకి వాలేను నేను. నన్నెత్తుకునే వాకట్లోకి వచ్చేడతను. ఇద్దరమూ అరుగుమీద కూచున్నాం. "నాకు అన్నం సయించింది కాదంటే నాకు నిద్రారాలేదనీ, నాకు ఏమీ తోచంది కాదంటే, నాకు మతిపోయిందనీ యిలాగ గంటలదాకా వకళ్ళ మనస్సు వకళ్ళకి విప్పి చెప్పుకున్నాం".

"మా అత్తగారు భాగ్యవంతులేకాని అందా లెరగరు. ఇల్లు చిన్నది. పైగా రంగూను పంపడానికి యెక్కడ చూస్తే అక్కడ పొగాకుబుట్టలు. రాత్రి బైట పడుకుని సుఖించినా పగలు చల్లబడీదాకా వకమూల పొగాకు ఘాటుకీ, వకమూల యెండగాడుపులకీ వుక్కిపోయీదాన్ని నేను. మూడు రోజులూ మూడు యుగాలైనాయి నాకు. గోదావరిదాటి బండి యెక్కేక నాకు ప్రాణాలు లేచివచ్చాయి".

"యథాప్రకారంగా యేడాది గడిచింది. నేను పెద్దదాన్నయినాను. పదమూడేళ్ళు వెళ్ళేయి. మా అత్త వచ్చి మళ్ళీ కొన్ని నగలు పెట్టింది"

"ఈ సమయంలో యూరోపుఖండంలో యుద్ధం సిద్ధమయింది. చూస్తూ ఉండగా అది పెరిగిపోయింది. నామామగారూ పెనిమిటీగూడా రంగూనులో పొగాకువర్తకం చేస్తారు. ఆవర్తకంలోనే ముసలాయన నాలుగైదులక్షలు సంపాదించారు."

కొంత సరుకుతో నాపెనిమిటిని రంగూను పంపి నామామగారు సరుకుభారీగా కొనడానికి దేశంలో ఉండిపోయారు. ఆరుమాసాలలో యేభయివేలు మిగిలేయి. ఇక యిక్కడివా రక్కడికి అక్కడివా రిక్కడికీ మారాలనుకున్నారు. సరుకుతో నామామగారు రంగూనుచేరేక నా పెనిమిటి చిల్కానా అనే ఓడ మీద బయలుదేరారని మాకు తంతి వచ్చింది.

"రెండు రోజులు గడిచిపోయాయి. మూడోనాడు వేంకటరామయ్యగారు వార్తాప్రతిక చదివి జర్మనీవారి యెమ్డెను జగన్నాథం దగ్గిర చిల్కానాను

ముంచివేసిందని చెప్పేరు. మాగుండెలు గుభేలుమన్నాయి. ఆవేళే వారు ప్రయాణమై వెళ్ళేరు. మర్నాడు "హతశేషుల వివరాలు యింగా బాగా తేలలే"దని తంతి వచ్చింది. ఆమర్నాడు నౌకరుని వెంటబెట్టుకుని వేంకటరామయ్యగారు వచ్చారు. ఏముందీ? నా పెనిమిటి సముద్రం పాలయినారు. మాకు మిన్ను విరిగిమీద పడింది".

"రెండు మాసాలా దాకా నాకు దుఃఖవేగం తగ్గలేదు. దినాలవరుసని నేనూ మాయమ్మా చిక్కి శల్యాలమైపోయాము. చుట్టాలు చాలా మంది వచ్చి ఓదార్చి పోయారు. పొలం పని తగ్గింది కనుక ప్రతీపూటా పొలం వెళ్ళవలసిన అవసరం లేకపోవడం చేత భూపతిరెడ్డి నాదగ్గిర కూచుని ఆమాటా యీమాటా చెప్పి దుఃఖం తగ్గించీవాడు. మొలలోతు దుఃఖంలో మోకాలులోతు సంతోషం అన్నట్లు ఆ దుఃఖసమయంలో భూపతి సాన్నిధ్యం నాకు కొంచెం ఊరడింపు కలిగించేది".

"ఒక సంవత్సరం గడిచింది.మొత్తానికి దుఃఖం నాకు మరుపువచ్చిందని చెప్పవచ్చును. నలుగురు ముత్తైదువులలోనూ మల్లుపంచె కట్టుకుని తిరగడం అలవాటయిపోయింది నాకు. వార్తాపత్రికలు, పుస్తకాలూ చదవడమూ, భూపతిరెడ్డి పొలంలో ఉన్నప్పుడు నౌకర్లకి యింటిపనులు పురమాయించడమూ, వేంకటరామయ్యగారు యేవూరేనా వెళ్ళినప్పుడు లెక్కలు రాయడమూ, ఇలాంటివి నేను మునుపటిలాగే చెయ్యడం మొదలుపెట్టేను".

"ఇలా ఉండగా కోర్టుపనిమీద వేంకటరామయ్యగారు చెన్నపట్టణం వెళ్ళేరు. పదిరోజులయిన తరువాత వారి దగ్గిర నుంచి వుత్తరం వచ్చింది. "ఇక్కడ భాగ్యవంతురాలగు ఒక వైశ్యవితంతువు యిరువదియేండ్ల యువతి మళ్ళీ పెళ్ళాడాలని నిశ్చయించుకుని మాగురువుగారిని వీరేశలింగం పంతులుగారిని ఆశ్రయించింది. వారు ఆమెను నాకిచ్చి యివాళే పెళ్ళి చేశారు. ఆమె తాలూకు వ్యవహారాలు కొన్ని దిద్దవలసి వుంది. నెలదాకా రాలేను" అని అందులో వుంది. అది చూచి మానాయన చాలా సంతోషించాడు. మాయమ్మ ఆశ్చర్యపడింది. నాకు కొత్తతలంపులు పుట్టేయి. ఆ ఉత్తరం తెచ్చి స్వయంగా మానాయన నాకు వినిపించాడు. ఆ వినిపించడంలో యేదో విశేషం ఉందని నాకు తోచింది".

"పుస్తకాల గది దగ్గిర భూపతి రెడ్డీ, నేనూ, హఠాత్తుగా తారసపడ్డాము. ఇద్దరికీ నవ్వు వచ్చింది "గురువుగారు వితంతువుని పెళ్ళాడేరుట" అని యిద్దరమూ ఒక్కమాటే అన్నాము. యిద్దరి చూపుల్లోనూ యేదో కొత్తధోరణి ప్రతిఫలించింది".

"తరువాత భోజనశాలకు వెళ్ళేము. మా నాయనకి యెడం వేపున మా యమ్మ కూచుంది. కుడివేపున నేను కూచున్నాను. మా ముగ్గురికీ యెదురుగా భూపతిరెడ్డి కూచున్నాడు. అందరమూ భోజనం ప్రారంభించినాము, గాని భూపతి వైపుకి నేనూ, నావైపుకి అతనూ ఓరచూపులు చూసుకున్నాం. మునుపుగూడా అప్పుడప్పుడు అలాచూసుకునే ఉన్నాంగాని అప్పుడేమీ విశేషం ఉండేది కాదు. ఈ చూపులో ఏదో విశేషం ఉన్నట్లు తోచింది. నాకు. ఇలా ఉండగా మా గురువుగారి వివాహప్రస్తావన వచ్చింది. కొంతసేపు ఏదో చెప్పి చెప్పి చివరికి మా యమ్మ "భూపతీ, నువ్వుగూడా వక వితంతువుని చూసుకో. మేం పెళ్ళిచేస్తాం" అంది. భూపతి నవ్వుకొని వూరుకున్నాడు. మా నాయనమాత్రం "అలాగే చెయ్యవచ్చు. ఆ గురువుగారి శిష్యుడు గాదూ యితనూ?"' అన్నాడు. "అయితే నువ్వు మాత్రం ఆ గురువుగారి శిష్యురాలివి కాదూ?" అని నాయంతరాత్మ నన్ను ప్రశ్నించింది.

"అది మొదలూ, నా హృదయంలో తీవ్రమైన ఆందోళనం ప్రారంభ మయింది. నేను మాత్రం మళ్ళీ యెందుకు పెళ్ళి చేసుకోకూడదూ? నాకేమీ అభ్యంతరం తోచలేదు. ఎందుకు చేసుకోరాదూ?"

"తప్పులేదు, కాని రెడ్లలో యింతవరకూ ఈయాచారం ప్రారంభం కాలేదు. నేను ముందు ఆ దారి తొక్కాలి. కులం వారి ఆక్షేపణలకీ తిట్లకీ నేను ముందు వడిగట్టాలి. అయితే యేమి! నాకు సాహసం కలిగింది. మళ్ళీ పెళ్ళాడాలని నేను నిశ్చయిం చేసుకున్నాను"

**(ఇక్కడ కొంత కథ లభ్యంకాలేదు. అసౌకర్యానికి చింతిస్తున్నాం - ప్రచురణకర్తలు.)**

............నప్పుడప్పుడు ఓరచూపులు చూశాను; గాని అతని మొగం కనవడలేదు. నలుగురిలోనూ యెవరూ యేమీ మాట్లాడలేదు. భోజనాలయినాయి. ఎవరిదారిని వారు వెళ్ళిపోయాము. నేను పక్కమీద పడుకున్న తరువాత మానాయన వచ్చి కూచుని "తల్లీ, పెళ్ళి చేసుకోవడం నిశ్చయమేనా అన్నాడు. సిగ్గుచేత నేను మాట్లాళ్ళేక మా నాయనమీద చేతులు

వేసి మొగం తిప్పుకున్నాను. సరే అని వెళ్ళిపోయాడు.

"రెండు రోజులు ఇలాగే మూగిదానిలా గడిపాను. మాయమ్మ మాట్లాడుతుందిగాని నేను జవాబు చెప్పలేను. మా నాన్న పలకరిస్తాడు గాని తలవూపడంతోనే సమాధానం చెప్పడం. భూపతి దూరదూరంగా మసలీవాడు. "వక్కమాటుమాత్రం నక్కీనక్కీ వచ్చి "కోపం వస్తే యేరంగూనేనా పోతాను తరువాత. నీ వూహ తెలవక వుడికిపోతున్నాను" అన్నాడు. యెందు కన్నానో యిప్పుడు చెప్పలేను గాని; "తరువాత చెబుతానులే" అన్నాను. అతను వెళ్ళిపోయాడు.

"ఇలా జరిగి అరగంటకి నేను కిటికీలో నుండి చూస్తూ ఉండగా వాకట్లో జట్కాబండి వచ్చి నిలిచింది. చూడగా ముందు వేంకటరామయ్యగారూ, తరువాత అన్నపూర్ణమ్మగారూ దిగారు. అక్కడే వున్న భూపతి వారితో తెల్లతెల్లపోతూ మాట్లాడేడు. అంతట్లో మానాయన వచ్చి వారిని యింటోకి తీసుకువచ్చాడు. అన్నపూర్ణమ్మ గారు వెతుక్కుంటూ నా దగ్గరికి వచ్చి పొదిమిపట్టి "ఎంతగుట్టూ? అప్పుడే చెబితే మాకీ తిప్పట లేకపోవునుగాదూ?" అన్నారు. నేనేమీ జవాబు చెప్పలేదు. "ఇంక సిగ్గెందుకూ?" అన్నారు ఆవిడ మళ్ళీని. దానికీ జవాబులేదు. ఇలా ఉండగా వేంకటరామయ్యగారు వచ్చారు. "చెల్లీ, మంచిపని చేశావమ్మా, దేవతలు సంతోషిస్తారు. కులం బాగుపడేపని తలపెట్టేవు. నీపేరు చరిత్రకారులు బంగారపు అక్షరాలతో రాస్తారు" అన్నారు."

"స్నానపుగదిలో ఉండగా వెనక వేపు కిటికీ దగ్గరికి వచ్చి భూపతి నన్ను పిలిచాడు. ఏమన్నాను నేను. చేతిలో తంతి ఉంది. "ఇది మీనాయన కొట్టిన తంతి. నిన్ను నాకిచ్చి - అంటే నన్ను నీకు పెళ్ళి చేస్తూ ఉన్నాననీ, మీరు వెంటనే సకుటుంబంగా రావలసిందనీ మీనాయన వేంకటరామయ్య గారికి తంతికొట్టేడు" అని చెప్పి వెళ్ళిపోయాడు. సగంసగం నీళ్ళుపోసుకున్న దాన్ని నేను నుంచోలేక వక్క క్షణం కూచుండిపోయాను.

"మర్నాడు తెల్లవారేటప్పటికి మళ్ళీయింకొక జట్కా వాకిట్లో నిలిచింది. వేంకటరామయ్యగారూ, వక ముసలాయనా బండి దిగారు. మానాయన యెదురుగా వెళ్ళి గౌరవం చేసి లోపలికి తీసుకువచ్చాడు. తరువాత మా నాయన నన్నూ, భూపతినీ రెక్కలు పట్టుకొని వచ్చి "నమస్కారాలు

నాయన నన్నూ, భూపతినీ రెక్కలు పట్టుకొని వచ్చి "నమస్కారాలు చెయ్యం"డన్నాడు. మాట్లాడకుండా ఇద్దరమూ అలా చేశాము. ఆ ముసలాయన దీవించాడు. నేను పక్క గదిలోకి పోయాను. భూపతిరెడ్డి అవతలికి పోయాడు. చూస్తినిగదా అతను తిరిగి వెనకవేపు కిటికీదగ్గరికి వచ్చి చిటికెలు వేస్తున్నాడు. "ఏమి"టన్నాను నేను. "వారు వీరేశలింగంపంతులుగారూ. మనకి పెళ్ళి చెయ్యడానికి వచ్చా"రన్నాడు భూపతి. "ఎప్పుడు!" అని నేనడిగాను గాని అది వినిపించుకోకుండా వెళ్ళిపోయాడతను".

ప్రయత్నాలి కది మొదలు. చూస్తూఉండగా పందిళ్లు తయారైనాయి. యిల్లంతా తోరణాలు. మన్నాడు ఉదయం మాయమ్మా, మానాయనా సన్నాయితో వూళ్ళోకి వెళ్లి "మాబుచ్చివెంకయ్యమ్మకి మళ్ళీ పెళ్ళి చేస్తున్నాము. మీరంతా రావలసిన"దని పిలిచి వచ్చారు.

"వూరంతా గగ్గోలయిపోయింది. దగ్గరి బంధువులు కొందరూ, స్నేహితులు కొందరూ వచ్చి మానాన్న బుద్ధి మళ్ళించడానికి ప్రయత్నించారు గాని లాభం లేకపోయింది".

"పురోహితుడు రాననగా వీరేశలింగం పంతులుగారే తంతు నడిపారు. పదిగంటల పొద్దెక్కేటప్పటికి నాకు సలక్షణంగా మళ్ళీ పెళ్ళి అయిపోయింది. వచ్చి ఉన్నవారి కందరికీ మానాయన తాంబూలాలిచ్చాడు గాని యెవరూ పుచ్చుకోలేదు. "సాహసం" అనుకుంటూ అంతా వెళ్ళిపోయారు.

"ఎవళ్ళేమంటే మాకేమి? నాచెలికాడు-నాభూపతి నాదేవుడయినాడు? "మా బిడ్డని బతికించుకున్నాం" అన్నారు మాయమ్మా మానాయనాను. వీరేశలింగంగారు ఆశీర్వదించి వెళ్ళిపోయారు. మన్నాడు వేంకట రామయ్యగారూ, అన్నపూర్ణమ్మగారూగూడా వెడుతూ మమ్మల్ని యిద్దర్నీ చెన్నపట్నం తీసుకువెళ్ళి వారంరోజులు వుంచుకొని బహుమతీ లిచ్చి పంపించారు".

"రాయవరంలోనూ, చుట్టుపట్టా నెల్లాళ్ళదాకా మాగొడవే. ప్రజలు ఎవరేనా మళ్ళీ పెళ్ళాడినందుకు నన్ను తిడితే అవి నాకు దీవన లనుకున్నాను. మానాయనగూడా అలాగే అన్నాడు".

"మాకమతంలో మాకులంవాళ్లు చాలా మంది ఉన్నారు. అందరూ దూరదూరంగా ఉండడం మొదలుపెట్టారు. మా నాన్న అడగ్గా "మీపని చేస్తాం.

మీ అన్నం తినము. మీనీళ్లు తాగము" అన్నారు" అయితే యిక్కడెందుకూ మీరూ? మీకు కులమే కావలిస్తే రంగూను వెళ్ళండి. కులంచెడ్డ మాపని మీకెందుకూ?" అని వాళ్ళనందర్నీ తీసేశాడు మానాన్న".

"పదిదినాలు గడవలేదు. రోజు రోజూ ఎంతో మంది మాకులం పడుచు మొగాళ్ళు వచ్చి మా నాయన నాశ్రయించారు. "మాకు భూవసతులు లేవు. డబ్బులేదు. రెక్కలే ఆధారం. పొలంలో కష్టపడి వచ్చి మేమే వండుకోవాలి. మీరు మీ బిడ్డకి మళ్ళీ పెళ్ళి చేశాక మాకు కొంచెం సుఖాశ కలుగుతోంది. మీరు మా కోసం వితంతువులను వెదకనక్కర్లేదు. మేమే తెచ్చుకుంటాము. పెళ్ళి చేయించండి. మీకమతంలో పనిచేసుకుని బతుకుతాం. దమ్మిడీ ఎక్కువ యివ్వనక్కరలేదు మాకు. మామూలు కూలి చాలు. కటాక్షించండి" అని చాలా మంది కోరగా వారి కందరికీ మానాయన అభయం ఇచ్చాడు. ఈ ఆషాఢమాసం వెళ్ళడంతోటే నా పెళ్ళయిన పందిట్లో మరి పది పునర్వివాహాలు జరగడానికి అంతా సిద్ధమైంది".

"కాలం వక్కలా వుండదు. నేడు రెడ్డికులంలో మళ్ళీ పెళ్ళిచేసుకున్న దాన్ని నేను ఒక్కతినే. నిజమే. అయితే ఈ సంఖ్య యిలా వుండిపోదు. ఇప్పటి నుంచి బాలవితంతువు లందరూ వితంతువులుగానే ఉండిపోరు. వాళ్ళకి మళ్ళీ చైతన్యం వచ్చే రోజూలూ, మానవత్వం వచ్చేరోజులూ, అవిగో వస్తున్నాయి. రెడ్డికులంలో దాంపత్యధర్మానికీ, ప్రేమకీ నవశక్తివచ్చే రోజులవిగో వచ్చిపడిపోతున్నాయి. మీరలా యెందుకు తెల్లపోతారూ? పురుషునిమీద ఆశ వున్న యౌవన వితంతువు వివాహానికవకాశం యివ్వకపోతే ఐహికసుఖాలిని జయించలేకపోవచ్చును. తప్పుదారి చూపడం కంటే కొత్తదారీ, ఆక్షేపించడానికి వీల్లేని దారీ ఉంటే పూర్వాచారామో అని యెందుకు కుళ్ళిపోతారూ? శాస్త్రాలూ మారాలి. మారితేగాని మన సంఘాలు చచ్చిపోతాయి. ఇలాగే మన పెద్దలు యింకా బిర్రబిగిస్తే, కొద్ది రోజుల్లోనే మన శాస్త్రాలు చూసీవాళ్ళూ లేకా, ఆదరించీవాళ్ళు లేకా నశించిపోతాయి."

◆